TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 67 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శుక్రవారం | జూన్ 19, 2026

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్




- కేటీఆర్ తీవ్ర విమర్శలు
- మాఫియా నాయకుడిలా రేవంత్ రెడ్డి వ్యవహార శైలి
- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న సీఎం..
- రాష్ట్రంలో పాలన శూన్యం
- 'రైతుబంధు' పైసలన్నీ ఢిల్లీకి..
- మల్కాజిగిరి బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ ధ్వజం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, తీరా గద్దెనెక్కాక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు మండిపడ్డారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రజలు నరకం చూస్తున్నారని, ఈ ప్రభుత్వం ఒక మాఫియాను తలపిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఆరు గ్యారంటీల ఊసే లేదని కేటీఆర్ విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, "వంద రోజుల్లో పిల్లలు పుడతారా?" అంటూ వింత సాకులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు.. పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్

## దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది

- సీఎం రేవంత్ రెడ్డి
- విద్యాశాఖను నేనే పర్యవేక్షిస్తున్నా
- ఎల్బీ స్టేడియం సభలో ముఖ్యమంత్రి




**హైదరాబాద్ , వాయిస్ ఆఫ్ వందే భారత్** "దేశ భవిష్యత్ పాఠశాలల్లోనే నిర్మితమవుతుందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, పేద పిల్లలు ఆత్మన్యూనతకు లోనుకాకుండా ఉండేందుకు ప్రభుత్వమే 'యంగ్ ఇండియా స్కూల్ కిట్స్' అందిస్తోందని స్పష్టం చేశారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి 'యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల' పంపిణీని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. విద్యా వ్యవస్థపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలనే సంకల్పంతోనే విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

## అనుమానం.. పెనుభూతమై




### రెండు నెలల పసికందును నరికి చంపిన కన్నతండ్రి

### భార్యపై అనుమానంతో ఘాతుకానికి ఒడిగట్టిన కిరాతకుడు

### బాబు తనకు పుట్టలేదంటూ గొడవ..

### రైల్వే పట్టాల పక్కన మృతదేహం లభ్యం

### నిజామాబాద్‌లో కలకలం..

### నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అనుమానం అనే పెనుభూతం ఒక పచ్చని సంసారంలో నిప్పులు పోసింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతండ్రే కాలయముడిగా మారి, రెండు నెలల పసికందును అత్యంత దారుణంగా నరికి చంపిన ఘోర కలియుగ ఘటన నిజామాబాద్ పట్టణంలో వెలుగుచూసింది. భార్యపై ఉన్న అనుమానంతో ఆ పసి ప్రాణాన్ని బలితీసుకున్న ఈ కిరాతక చర్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నయాగావ్‌కు చెందిన యువరాజ్, నిజామాబాద్‌లోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ప్రియాంకలకు ఏడాది క్రితం వివాహమైంది. పెళ్లయిన కొన్ని నెలల పాటు వీరి కాపురం అన్యోన్యంగానే సాగింది. అయితే, ఆ తర్వాత ప్రియాంకపై యువరాజ్‌కు అనుమానం మొదలైంది.

## కేంద్రానిది అప్పుడూ, ఇప్పుడూ మొండివైఖరే

- మాజీ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి
- నాడు రైతులకు అండగా నిలిచి..
- రూ.12 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేసిన కేసీఆర్
- నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో అన్నదాతలు ఆగం
- అధికారంలోకి రాగానే కాంగ్రెస్ చేతులెత్తేసింది
- నిజామాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ధ్వజం




**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వంద భారత్ :** ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనాదిగా తెలంగాణ పట్ల కక్షపూరితంగా, మొండి వైఖరితోనే వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. కేంద్రం ఎన్ని ఇబ్బందులు సృష్టించినా.. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఊరూరా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు అండగా నిలిచారని ఆయన గుర్తుచేశారు.

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే.. ఇక మీరెందుకు?

- కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక, విశ్వాస ఘాతక ప్రభుత్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- రాహుల్ గాంధీ జన్మదినం నాడే 'రైతు డిక్లరేషన్'కు చెల్లుచీటీ
- రైతు బీమా, రైతుబంధుపై మంత్రులకు సవాల్..
- సిద్దిపేటలో హరీశ్‌రావు ధ్వజం




**సిద్దిపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే.. ఇక మీరు అధికారంలో ఎందుకు? పంటల కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. శుక్రవారం సిద్దిపేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడే సీఎం రేవంత్ రెడ్డి రైతులపై విషం కక్కారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ వేదికగా రాహుల్ గాంధీ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్'ను ఆయన జన్మదినం రోజే తెలంగాణ ప్రభుత్వం బొందపెట్టిందని విమర్శించారు.

## దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది

**• సీఎం రేవంత్ రెడ్డి**

**(మొదటి పేజీ తర్వాత.. )** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఈ ఎడ్యుకేషన్ కిట్లను విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వర్గీకరించి పంపిణీ చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు: 22 అవసరమైన వస్తువులతో కూడిన కిట్లు, వసతి గృహ (హాస్టల్) విద్యార్థులకు 10 వస్తువులతో కూడిన కిట్లు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు: 7 వస్తువులతో కూడిన కిట్లు అందజేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కేవలం భాషా ప్రయుక్తంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. “60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, ఎందరో విద్యార్థుల ఆత్మబలిదానాలు, త్యాగాల పునాదులపై ఈ రాష్ట్రం ఏర్పడింది. కానీ గత పాలకులు విద్యాశాఖను పూర్తిగా విధ్వంసం చేశారు. వారి అరాచక పాలన వల్ల రాష్ట్ర విద్యా రంగానికి వందేళ్ల నష్టం జరిగింది” అని సీఎం మండిపడ్డారు. ధ్వంసమైన విద్యా రంగాన్ని మళ్లీ వికాసం వైపు నడిపించేందుకు తమ ప్రభుత్వం సరికొత్త ‘తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ’ని తీసుకువచ్చిందని సీఎం వివరించారు. ఈ ప్రక్షాళన కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 8.5 శాతం నిధులను కేటాయించామన్నారు. వెనుకబడిన తరగతుల విద్యార్థుల చదువుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నామని, దీనిని ఖర్చుగా కాకుండా భావితరాల భవిష్యత్తు కోసం పెడుతున్న పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చినట్లే, విద్యార్థులకు కూడా ఒకటో తేదీనే కాస్మోటిక్ ఛార్జీలు నేరుగా చెల్లిస్తున్నామని సీఎం చెప్పారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక వాటిని గణనీయంగా పెంచామని గుర్తుచేశారు. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ‘నో అడ్మిషన్’ బోర్డు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పాఠశాలలకు ఇంతటి ఆదరణ వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనమైన కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

- **కేటీఆర్ తీవ్ర విమర్శలు**
- **మాఫియా నాయకుడిలా రేవంత్ రెడ్డి వ్యవహార శైలి**
- **కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న సీఎం..**
- **రాష్ట్రంలో పాలన శూన్యం**
- **‘రైతుబంధు’ పైసలన్నీ ఢిల్లీకి..**
- **మల్కాజిగిరి బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ ధ్వజం**



**(మొదటి పేజీ తర్వాత.. )** వ్యంగ్యాస్త్రాలు



సంధించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిందని, అయినా రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం.. ’హైడ్రా’ పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చేస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులను ఆయన ’దండుపాళ్యం ముఠా’తో పోల్చారు. ఈ ప్రభుత్వాన్ని ఒక పెద్ద మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర కనీసం గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన ’రైతుబంధు’ నిధులను బంద్ చేసి.. ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో ’టింగ్ టింగ’ అని పడేలా చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే.. అన్నదాతలు తాము పండించిన ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులుగా మారి పోరాడాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఇక్కడి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన అండగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## కేంద్రానిది అప్పుడూ, ఇప్పుడూ మొండివైఖరే

**(మొదటి పేజీ తర్వాత.. )** శుక్రవారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యంలో కేవలం మూడో వంతు, ఇతర పంటల్లో 25 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామనడం కేంద్రానికి అలవాటుగా మారిందని ప్రశాంతరెడ్డి విమర్శించారు. నాడు బీఆర్ఎస్ హయాంలోనూ కేంద్రం ఇదే వివక్షను చూపిందని, దీనిపై కేసీఆర్ ఢిల్లీ స్థాయిలో పెద్ద పోరాటమే చేశారని గుర్తు చేశారు. కేంద్రం నిరాకరించినప్పటికీ, రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సొంత నిధులు రూ.12 వేల కోట్లు కేటాయించి.. మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు, సోయాబీన్, శనగలు, సన్‌ఫ్లవర్ వంటి అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో మార్కెట్లు లేక అల్లాడిన రైతులకు ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి భరోసా ఇచ్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంటల కొనుగోళ్లకు, తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోందని వేముల ధ్వజమెత్తారు. ఒకవైపు కేంద్రం 25 శాతం కంటే ఎక్కువ కొననననడం, మరోవైపు మిగిలిన పంటను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుండటంతో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం చేతులెత్తేసినట్లయిందని విమర్శించారు. దీనివల్ల మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియక అగమ్యగోచరంలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర దక్కక, తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్ముకుంటూ రైతులు భారీగా నష్టపోతున్నారని, పెట్టుబడులు కూడా రాక రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున రాద్ధాంతం చేశారని ప్రశాంతరెడ్డి గుర్తు చేశారు. “కేంద్రం కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి పైసల్లేవా?” అంటూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన ఉదంతాన్ని ఆయన ప్రస్తావించారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి గింజనూ మద్దతు ధరతో పాటు అదనపు బోనస్ ఇచ్చి కొంటామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలోనే చేతులెత్తేసిందని మండిపడ్డారు. నాడు కేసీఆర్ పదేళ్లపాటు రైతన్నకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తే, నేడు రేవంత్ సర్కార్ తమ వల్ల కాదంటూ తప్పుకుంటోందని విమర్శించారు. రాష్ట్రంలో పండిన మొత్తం పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని వేముల ప్రశాంతరెడ్డి హెచ్చరించారు.

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే.. ఇక మీరెందుకు ?

➲ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

**(మొదటి పేజీ తర్వాత.. )** ధాన్యం ఏదైనా మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని, కేంద్రం ఎంత చెబితే అంతే కొంటామంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధ్యత నుండి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. “నాడు కేసీఆర్ ప్రభుత్వం కేంద్రంతో పోరాడి మరీ అన్ని పంటలను కొనుగోలు చేసింది, కానీ నేడు కాంగ్రెస్ చేతులెత్తేసింది” అని ఆయన గుర్తు చేశారు. వ్యవసాయంపై ప్రభుత్వానికి కనీస అవగాహన లేదని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. “ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తామనడం రైతుల గొంతు కోయడమే. మిర్చి రైతులకు ఎకరాకు కనీసం ఐదారు బస్తాల యూరియా అవసరం. కేంద్రం ధరలు పెంచితే, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాల్సింది పోయి, పరిమితులు విధించడం దారుణం” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు విషయంలోనూ ప్రభుత్వం మోసం చేస్తోందని, 2024-25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతుబంధు కింద దాదాపు రూ.29,358 కోట్లు బకాయి పడిందని ఆయన గణాంకాలతో వివరించారు. రైతు బీమా ఆగలేదని మంత్రులు చెబుతున్న మాటలు అబద్ధమని హరీశ్ రావు బల్ల గుద్ది మరీ చెప్పారు. “రాష్ట్రంలో 7,600 మంది రైతులకు బీమా అందలేదు. ఎందుకు అందలేదంటే.. ప్రభుత్వం ప్రీమియం కట్టలేదు కాబట్టి. ఈ విషయంపై చర్చకు ఏ గ్రామానికి రావడానికైనా నేను సిద్ధం, మీరు వస్తారా?” అని మంత్రులకు సవాల్ విసిరారు.

కేబినెట్ తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అన్ని పంటలను యథావిధిగా కొనుగోలు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం, తన తప్పుడు నిర్ణయాలకు రైతులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమానం.. పెనుభూతమై

- **రెండు నెలల పసికందును నరికి చంపిన కన్నతండ్రి**
- **భార్యపై అనుమానంతో ఘాతుకానికి ఒడిగట్టిన కిరాతకుడు**
- **బాబు తనకు పుట్టలేదంటూ గొడవ..**
- **రైల్వే పట్టాల పక్కన మృతదేహం లభ్యం**
- **నిజామాబాద్‌లో కలకలం..**
- **నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**(మొదటి పేజీ తర్వాత.. )** ప్రతి చిన్న విషయానికి ఆమెను శంకిస్తూ, మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే ప్రియాంక గర్భం దాల్చడంతో నిందితుడి వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. ఇటీవల ప్రసవం కోసం పుట్టింటికి వచ్చిన ప్రియాంక.. రెండు నెలల క్రితం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ పుట్టినా యువరాజ్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఆ చిన్నారి తనకు పుట్టలేదంటూ భార్యతో, ఆమె కుటుంబ సభ్యులతో పలుమార్లు తీవ్రంగా గొడవపడ్డాడు. ఈ క్రమంలోనే జూన్ 17న నిజామాబాద్‌లోని అత్తగారింటికి వచ్చిన యువరాజ్, ఎవరికీ అనుమానం రాకుండా రెండు నెలల పసికందును బయటకు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత నగర శివారులోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి బాలుడిని తీసుకెళ్లి, కత్తితో పలుమార్లు నరికి అత్యంత క్రూరంగా హత్య చేశాడు. అనంతరం ఆ పసికందు మృతదేహాన్ని రైల్వే పట్టాల పక్కన పడేసి అక్కడి నుంచి పరారయ్యాడు.సాయంత్రం దాటినా భర్త, పసిబిడ్డ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన ప్రియాంక, కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి, శుక్రవారం నాడు యువరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పట్టాల పక్కన పడేసిన పసికందు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కళ్ల ముందే ఆడుకోవాల్సిన రెండు నెలల పసిగుడ్డు శవమై కనిపించడంతో తల్లి ప్రియాంక, ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారి ఆక్రందనలు స్థానికులను సైతం కన్నీళ్లు పెట్టించాయి. కన్నబిడ్డను ఇంత దారుణంగా పొట్టనబెట్టుకున్న కిరాతక తండ్రి యువరాజ్‌ను కఠినంగా శిక్షించాలంటూ పట్టణవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జూన్ 19, 2026

# కారులో రేగిన మంటలు

- జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై ప్రమాదం
- ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు క్షేమం..
- అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- చారకొండ మండలం జూపల్లి గ్రామ శివారులో ఘటన
- అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే పూర్తిగా దగ్ధమైన వాహనం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఒక కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడం తీవ్ర కలకలం రేపింది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామ శివారులోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై (హైవే) శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సమయస్ఫూర్తితో వ్యవహరించి, అప్రమత్తమై వెంటనే వాహనం నుంచి కిందకు దూకేయడంతో తృటిలో పెను ప్రాణాపాయం తప్పింది. స్థానికులు మరియు బాధితుల కథనం ప్రకారం.. నలుగురు ప్రయాణికులతో వెళ్తున్న కారు జూపల్లి గ్రామ శివారులోకి రాగానే, వాహనంలో ఒక్కసారిగా సాంకేతిక లోపం తలెత్తింది. ఇంజిన్ భాగం నుండి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమయ్యాడు. క్షణాల వ్యవధిలోనే కారును హైవే పక్కకు నిలిపివేసి, లోపల ఉన్న వారందరినీ కిందకు దిగాల్సిందిగా కోరాడు. వారు కిందకు దిగిన కొద్దిసేపటికే కారులో మంటలు చెలరేగి, వాహనం మొత్తానికి వ్యాపించాయి. హైవేపై కారు తగలబడుతుండటాన్ని చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అగ్నిమాపక వాహనంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో వాహన యజమానికి భారీ నష్టం వాటిల్లింది. ఏది ఏమైనప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కారులోని నలుగురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడటంతో అటు పోలీసులు, ఇటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# జీవితాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉంది

- అంగన్‌వాడీ టీచర్ పులి శారద



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వంద భారత్ :** మానవ జీవితాన్ని ఉన్నతంగా మార్చే అద్భుతమైన శక్తి కేవలం విద్యకు మాత్రమే ఉందని వేములవాడ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పులి శారద అన్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని న్యూ అర్బన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన చిన్నారుల చేత సాంప్రదాయబద్ధంగా అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా పులి శారద మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయంలో పిల్లల విద్యాభ్యాసానికి అక్షరాభ్యాసం అనేది ఎంతో పవిత్రమైన కార్యక్రమమని పేర్కొన్నారు. “అక్షరం అంటే నాశనం లేనిదని, అభ్యాసం అంటే నేర్చుకోవడం అని అర్థం. దీనినే విద్యారంభం లేదా అక్షరారంభం అని కూడా పిలుస్తారు” అని వివరించారు. సాధారణంగా పిల్లలకు రెండు నుండి ఐదు సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత ఈ వేడుకను జరిపిస్తారని, ఈ కార్యక్రమానికి వసంత పంచమి, విజయదశమి లేదా పిల్లల జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం వంటి రోజులను మన పెద్దలు చాలా శ్రేష్టమైనవిగా భావిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం కోసం అంగన్‌వాడీ కేంద్రాన్ని అందంగా అలంకరించి, చిన్నారులను కూర్చోబెట్టి విద్యాదేవత సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దలు, ఉపాధ్యాయులు కలిసి చిన్నారుల చేత పలకపై బలపంతో “ఓం నమశ్శివాయ” లేదా “ఓం శ్రీ గణేశాయ నమః” అని మొదటి అక్షరాలు దిద్దించారు. కేవలం పాఠశాలలో పుస్తకాల్లోని విషయాలను బోధించడం మాత్రమే చదువు కాదని, చదువుకున్న జ్ఞానాన్ని జీవితంలో ఆచరించే విధంగా పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని పులి శారద ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ ఉత్సాహభరితమైన కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, మహిళా సంఘాల సమాఖ్య రిసోర్స్ పర్సన్ గొడిసెల రేణుక, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ విధింపు

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఈ నెల 21న జరగనున్న జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని నీట్ పరీక్షా కేంద్రాల వద్ద 'భారతీయ నాగరిక్ సురక్ష సంహిత' సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమిగూడటం పూర్తిగా నిషిద్ధం. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల పరిసరాల్లోని అన్ని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలి. ఈ నిషేధాజ్ఞలు ఆదివారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. పోలీస్ ఉత్తర్వులను అతిక్రమించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు అచ్చంపేట పట్టణంలో అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు ఈ వేడుకలను పండగలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కేక్ కట్ చేసి, రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని దేశ ప్రజలు 'భావి భారత ప్రధాని'గా చూస్తున్నారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికి ఆయన నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. దేశ ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా రాహుల్ గాంధీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజా సేవలో సుదీర్ఘకాలం వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తాయని నేతలు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు నగరంలో స్వీట్లు పంచుతూ, బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ ఘనమైన వేడుకల్లో అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుచ్చి రాములు, విజయ డైరీ చైర్మన్ నరసయ్య యాదవ్, మాజీ ఎంపీపీ రామనాథం, ముఖ్య నాయకులు కొండూరు శేఖర్, గౌరీ శంకర్, రాజగోపాల్‌లతో పాటు అచ్చంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, రాహుల్ గాంధీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే జైలు

## వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భారీగా మందుబాబులు పట్టుబడ్డారు. పట్టుబడిన 143 మందిని శుక్రవారం లోక్ అదాలత్‌లో భాగంగా వేములవాడ కోర్టులో హాజరుపరచగా.. మేజిస్ట్రేట్ మేఘన వారికి భారీ జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. కోర్టు నిందితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వారి రక్తంలో ఉన్న ఆల్కహాల్ శాతాన్ని బట్టి కింది విధంగా జరిమానాలు ఖరారు చేసింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేకంగా అరైవ్ అలివ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణనష్టం, కుటుంబాలు రోడ్డున పడే దుస్థితిపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. “మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ మీ ప్రాణాల మీదికి తెచ్చుకోవడమే కాకుండా, ఎదురుగా వచ్చే అమాయకుల కుటుంబాల్లో కూడా విషాదం నింపవద్దు” అని ఆయన హెచ్చరించారు. ఒక్కసారి మద్యం సేవించి పోలీసులకు దొరికితే కేవలం జరిమానాతోనే అయిపోదని, అది వారి కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని సీఐ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల వల్ల భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, ముఖ్యంగా పాస్‌పోర్ట్ లేదా ప్రభుత్వ ఉద్యోగాల కోసం 'పోలీస్ వెరిఫికేషన్' (చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోజూ ఈ తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, జూన్ 19, 2026

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కాలి



**ఆత్మకూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి నాయకులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూచన రవళి రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆత్మకూరు, దామెర మండలాల కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా శిబిరం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రతి బూత్ పరిధిలో పారదర్శకంగా పర్యవేక్షించాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా జాబితా నుండి తొలగించబడకుండా బీఎల్ఏలు నిరంతరం నిఘా ఉంచాలని దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణా శిబిరంలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కమలాపురం రమేష్, ఆత్మకూరు, దామెర మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, దుబాసి రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులపై బూత్ స్థాయి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందారు.

# అచ్చంపేటలో 'శ్రీ సాయి హార్ట్ హాస్పిటల్' ప్రారంభం

- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ
- 24 గంటల అత్యవసర సేవలు అందిస్తాం
- డాక్టర్ ఎం.శంకర్ వెల్లడి

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ సాయి హార్ట్ హాస్పిటల్'ను శుక్రవారం రోజున స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఘనంగా ప్రారంభించారు. ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు యాజమాన్యం,



సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. అచ్చంపేట నియోజకవర్గ ప్రజలకు స్థానికంగానే గుండె (హార్ట్) సంరక్షణకు సంబంధించిన ప్రత్యేక ఆసుపత్రి అందుబాటులోకి రావడం చాలా శుభపరిణామన్నారు. ఈ మధ్యకాలంలో ఈ ప్రాంతంలో సరైన గుండె వైద్య నిపుణులు, ఆసుపత్రులు లేకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రోగులను హైదరాబాద్ లేదా ఇతర సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనివల్ల ప్రయాణ భారంతో పాటు, పేద ప్రజలకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అచ్చంపేటలోనే శ్రీ సాయి ఆసుపత్రి వారు అత్యాధునిక వైద్య సేవలు ప్రారంభించడం వల్ల స్థానికులకు ఎంతో మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు.

### 24 గంటల అత్యవసర వైద్యం – డాక్టర్ ఎం. శంకర్

ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శంకర్ మాట్లాడుతూ.. తమ ఆసుపత్రిలో



రోగులకు 24 గంటల పాటు నిరంతర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ముఖ్యంగా గుండె జబ్బులతో బాధపడే వారికి, అత్యవసర (ఎమర్జెన్సీ) పరిస్థితుల్లో ఉన్న వారికి తక్షణమే ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ నేత జూలూరి ప్రదీప్, ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బందితో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాడి రంగానికి పూర్వవైభవం తెస్తాం

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- పాడి పరిశ్రమ అవగాహన సదస్సు
- రైతులతో ఎమ్మెల్యే ముఖాముఖి
- పాలకు ఇన్సెంటివ్‌లు సకాలంలో అందిస్తాం
- స్టేట్ ప్రెసిడెంట్ అమిత్ రెడ్డి, ఎమ్మెల్యే వెల్లడి

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణీగా మార్చడమే కాకుండా, ప్రతి రైతు ఇంట పాడి–పంటలతో సంపద నింపడమే ప్రస్తుత ఇందిరమ్మ రాజ్యం ప్రభుత్వ ముఖ్య ఆశయమని అచ్చంపేట శాసనసభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. అచ్చంపేట పట్టణంలోని అంగిరేకుల ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాడి రైతుల అవగాహన సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాడి రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమను నమ్ముకున్న ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తీవ్రంగా నష్టపోయిన పాడి రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను, రాయితీలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. రైతన్నల చెమట చుక్కకు సరైన ధర, గౌరవం కల్పించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షపాతేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీతో పాటు రైతాంగానికి అవసరమైన అన్ని వసతులను కల్పిస్తూ అండగా నిలిచామన్నారు. లీటరు పాలకు ఇచ్చే ఇన్సెంటివ్‌లను సకాలంలో అందిస్తూ, సహకార సంఘాల ద్వారా పాడి రైతులకు గరిష్ట లాభాలు చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, అందుకే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కొనియాడారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం, తాను ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని ఈ సదస్సు వేదికగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ పాలసీతలికరణ స్టేట్ ప్రెసిడెంట్ గుత్తా అమిత్ రెడ్డి పాల్గొని పాడి రైతుల సంక్షేమానికి సంస్థ తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సదస్సులో అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, విజయ డైరీ పాలసీతలికరణ చైర్మన్ నర్సయ్య యాదవ్, మాజీ ఎంపీపీ రామనాథం, అచ్చంపేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ బుచ్చి రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రముఖ నేత కాశన్న యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి జై కొట్టిన వేములవాడ చేనేత నూతన పాలకవర్గం

విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో మూకుమ్మడిగా చేరిక



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. ఇటీవల జరిగిన వేములవాడ చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పాలకవర్గం మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీలో చేరింది. శుక్రవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నూతన అధ్యక్షులతో పాటు కార్యవర్గ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. చేనేత పారిశ్రామిక సహకార సంఘ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తాటికొండ రాజయ్య, కార్యదర్శి పారవెల్లి రాజేశం, కోశాధికారి రాపెల్లి దేవదాసులతో పాటు పాలకవర్గ సభ్యులందరూ ఒకేసారి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేనేత రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమం, వేములవాడ ప్రాంత ప్రగతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక కార్యక్రమాలకు ఆకర్షితులమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాలనపై పూర్తి విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీకి తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని చెప్పారు. గతంలో చేనేత రంగం ఎదుర్కొన్న సంక్షోభాల నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా రాజీ పడబోమని, చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం అందించేందుకు త్వరలోనే మరిన్ని ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నామని విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, చేనేత సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ లేబర్ కార్డులు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్న అర్హులందరికీ లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు గాలిగూటి జగదీష్ అన్నారు. శుక్రవారం పట్టణంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా లేబర్ ఆఫీసర్ రాజ్ కుమార్ హాజరై మాట్లాడారు. కార్మికులందరూ లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవాలని ఆయన సూచించారు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని సూచించారు. సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరూ లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిచంద్ర, కార్యదర్శి సూర్యనారాయణ, వెంకటయ్య, అర్జున్, సీమోన్ ఆనందం, ఎల్లికంటి నిరంజన్, సాంబశివరావు, శ్రీనివాసులు, కృష్ణయ్య, రామచంద్రం పాల్గొన్నారు.